రేవంత్ కుట్రలు చెల్లవు

- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కితగ్గం
- అక్రమ కేసులు, అరెస్టులతో బలహీనపర్చాలని సర్కార్ కుట్ర
- హామీలు అమలుకు నిలదీస్తం
- నష్టపోయిన కంపెనీ నుంచి బీఆర్ఎస్‌కు డబ్బులు వచ్చాయని అనడం అర్థరహితం
- అవినీతి జరిగిందని కోర్టు నిర్ధారించలేదు
- విచారణకు మాత్రమే అనుమతి ఇచ్చింది
- లీగల్‌సెల్ సలహా మేరకు కార్యాచరణ చేపడుతాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, సీనియర్‌నేతలు దేవీప్రసాద్, కాలేరు వెంకటేశ్, బిగాల గణేశ్‌గుప్తా తదితరులు

రేవంత్‌రెడ్డి తప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కేటీఆర్ అడుగడుగునా ప్రశ్నించినందుకే అటెన్షన్ డైవర్షన్ కోసం ఫార్ములా ఈ-కారు రేసు కేసు పెట్టిండ్రు. మానసికంగా బలహీనపర్చాలని చూస్తున్నరు. ఇలాంటి అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులపై భవిష్యత్తులో ఇంకా పెడుతరు. వాటిని ఎదుర్కోడానికి మేం సిద్ధంగా ఉన్నం. -హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): అక్రమ కేసులు, అరెస్టులతోనూ బీఆర్ఎస్ నాయకులను బలహీనపరచాలనే రేవంత్ రెడ్డి సర్కారు కుట్ర చెల్లబోదని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. ఎన్నిరకాల అక్రమ కేసులు పెట్టినా ప్రశ్నించడంపైన వెనక్కి తగ్గేది లేదని, రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసే దాకా వెంటపడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. మంగళవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ కారు రేసు కేసులో అవినీతి జరిగిందని నిర్ధారించలేదని, విచారణకు మాత్రమే అనుమతి ఇచ్చిందని స్పష్టంచేశారు. తమ లీగల్ సెల్ సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామని చెప్పారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, పాడి కౌశిక్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, పార్టీ నేతలు దేవీ ప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నగేశ్‌తో కలిసి హరీశ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. రైతు బంధు ఎగ్గొట్టడం వల్ల ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటున్నదని, అన్ని సర్వే రిపోర్టులు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కేటీఆర్ ప్రశ్నించినందుకే అటెన్షన్ డైవర్షన్ కోసం ఈ కేసు పెట్టారని విమర్శించారు.

ఎన్నో పోరాటాలు, త్యాగాలతో తెలంగాణను తెచ్చుకున్నం. తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీకి ముఖ్యం. ఎన్ని ఒత్తిళ్లు పెట్టినా, అక్రమ కేసుల్లో ఇరికించినా 420 హామీలు అమలుచేసే దాకా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటం. -హరీశ్‌రావు

ఈ కేసులో అవినీతి జరిగిందని హైకోర్టు నిర్ధారించలేదదు. అవినీతి ఉన్నదని శిక్ష వేసిన తీర్పు కాదు. ప్రభుత్వం అవినీతి జరిగిందని చెప్పినప్పుడు.. విచారణ చేసుకోండని కోర్టు పేర్కొన్నది. కేటీఆర్ ఎలాంటి తప్పూ చేయలేదు. విచారణకు అన్ని విధాలుగా సహకారం అందిస్తరు. -హరీశ్‌రావు

విచారణకు సహకరిస్తాం

ఈ కార్ రేసులో హైకోర్టు విచారణ కొనసాగించాలని మాత్రమే చెప్పింది తప్ప శిక్ష విధించాలని కాదని హరీశ్ స్పష్టం చేశారు. కేటీఆర్ ఎలాంటి తప్పూ చేయలేదని, విచారణకు సహకారిస్తారని వెల్లడించారు. గతంలో కూడా విచారణకు సిద్ధమని కేటీఆర్ చెప్పారని, ఈ అంశంలో సుప్రీంకోర్టుకు వెళ్లాలా? లేదా అనే అంశాన్ని బీఆర్ఎస్ లీగల్ సెల్ నిర్ణయిస్తుందని తెలిపారు. హైకోర్టు తీర్పు కాపీని పూర్తిగా చదివిన తర్వాత లీగల్ సెల్ సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామని న్యాయస్థానాల మీద, చట్టాల మీద తమకు గౌరవం ఉన్నదని, సుప్రీంకోర్టులో కొట్లాడుతామని స్పష్టంచేశారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి డబ్బుల కట్టలతో కెమెరాల ముందు అడ్డంగా దొరికి జైలుకు పోయారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి అరెస్టుకు, కేటీఆర్‌పై అక్రమ కేసుకు పోల్చడం సరికాదని హితవుపలికారు.

రూపాయి కూడా చేతులు మారనప్పుడు అవినీతి ఎట్లా?

ఈ కేసులో రూపాయి కూడా చేతులు మారనప్పుడు అవినీతి ఎట్లా అవుతుందని హరీశ్ నిలదీశారు. 'గ్రీన్‌కో సంస్థకు రూపాయి లబ్ధి చేయనప్పుడు వారు ఎందుకు మాకు తిరిగి డబ్బులు ఇస్తారు? అదే కంపెనీ ఫార్ములా ఈ నిర్వహణలో భారీగా నష్టపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో వారి నుంచి డబ్బులు వచ్చాయనడం అర్థరహితం. కేటీఆర్‌పై పెట్టింది తుఫేల్ కేసు' అని పేర్కొన్నారు. సోమవారం ఏసీబీ దగ్గరికి కూడా విచారణ ఎదుర్కోవడానికి కేటీఆర్ వెళ్లారని గుర్తుచేశారు. పోలీసులు 45 నిమిషాలు ఆపినా కేటీఆర్ ఓపిగ్గా వేచి చూశారని, కచ్చితంగా విచారణను ఎదుర్కొంటామని, 9న కూడా విచారణకు వెళ్తారని చెప్పారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడం కోసమే ఫార్ములాఈని కేటీఆర్ హైదరాబాద్‌కు తెచ్చారని గుర్తుచేశారు. ఇదే రేసును తమ రాష్ట్రాలకు, నగరాలకు తీసుకురావడానికి అనేక రాష్ట్రాలు పోటీపడ్డాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారని, కేటీఆర్ వెల్లడించే వరకు ఈ విషయాన్ని ఎందుకు రేవంత్ బయటపెట్టలేదని నిలదీశారు.

కడిగిన ముత్యంలా బయటకొస్తరు

ఎలాంటి తప్పూ చేయలేదన్న ధైర్యం ఉన్నది కాబట్టే విచారణకు వెళ్తున్నామని, కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకొస్తారని హరీశ్ ధీమా వ్యక్తంచేశారు. ఇది కేవలం కక్ష సాధింపు చర్య మాత్రమేనని విమర్శించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తాము ఎప్పుడూ తెలంగాణ ప్రజల పక్షమేనని స్పష్టంచేశారు. కేటీఆర్‌పై పెట్టిన కేసులుగాని, పార్టీ నేతలపైన పెడుతున్న కేసులనుగాని పార్టీ చట్టపరంగా ఎదుర్కొంటుందని వెల్లడించారు.

రేవంత్‌పై నమ్మకం లేదు

కోర్టులు, అధికారులపై తమకు విశ్వాసం ఉన్నదిగాని రేవంత్‌రెడ్డిపైన లేదని హరీశ్ పేర్కొన్నారు. లగచర్ల కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఇవ్వని వాంగ్మూలాన్ని ఇచ్చినట్టుగా పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. కోర్టు తీర్పుపైన కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, విచారణ ప్రారంభం కాకముందే తప్పు జరిగిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల పైన చిచ్చరపిడుగుల్లా పోరాడిన చరిత్ర తమదని, గతంలో అరెస్టైన కేటీఆర్ వరంగల్ జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. అక్రమ అరెస్టులకు భయపడబోమని స్పష్టంచేశారు.

నాడు రేవంత్‌రెడ్డి అరెస్టయి జైల్లో పడడానికి.. ఈ కేసుకు పొంతనలేదు. తెలంగాణ కోసం, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడం కోసం కేటీఆర్ ఫార్ములా ఈ రేస్ తీసుకొచ్చారు. రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లడాన్ని, కేటీఆర్ అక్రమ కేసుతో పోల్చడమంటే మోకాలికి బోడిగుండుకు ముడివేయడమే. -హరీశ్‌రావు

రేవంత్‌రెడ్డివి పరిణతి లేని పనులు

- అభివృద్ధిపై సీఎంకు అవగాహన లేదు
- ఫార్ములా-ఈ రాష్ట్రానికే గర్వకారణం
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర అభివృద్ధిపై అవగాహనలేదని, ఆయన పరిణతి లేని పాలన సాగిస్తున్నారని శాసనమండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. ఫార్ములా- ఈ రేస్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, దీనిని హైదరాబాద్‌లో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. ఈ-రేస్‌ను హైదరాబాద్‌కు తీసుకొనిరావడానికి కేటీఆర్ ప్రదర్శించిన స్ఫూర్తిని అర్థం చేసుకునే పరిణతి లేదని, కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. దేశంలో అన్ని రాష్ట్రాలను మించి తెలంగాణను నంబర్ వన్‌గా నిలిపేందుకు కేసీఆర్ నాయకత్వంలో భగీరథ ప్రయత్నం జరిగిందని వివరించారు. దేశంలో తెలంగాణ అంటే అభివృద్ధికి చిరునామాగా నిలిపింది బీఆర్ఎస్ సర్కారేనని చెప్పారు. పదేండ్లపాటు అద్భుతంగా సాగిన తెలంగాణ అభివృద్ధి ప్రస్థానం ఏడాదిగా కాంగ్రెస్ పాలనలో కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక చతికిలపడిందని, ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేటీఆర్‌పై కేసులు పెట్టి వేధించాలని చూస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

కుట్రలను తిప్పికొడతాం

- డైవర్షన్ కోసం ఫార్ములా కేసు
- బీఆర్ఎస్‌ది రైతు సంబురం
- కాంగ్రెస్‌ది కేసుల సంబురం
- కాంగ్రెస్, బీజేపీ తోడుదొంగలు
- మాజీ మంత్రి జగదీశ్ ఆగ్రహం
- రేవంత్‌ది పైశాచికానందం: వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా పేరిట చేసిన మోసం నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఫార్ములా-ఈ కేసును తెరపైకి తెచ్చారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్కారు వైఫల్యాలను అడుగడుగునా ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, పొలాలకు నీళ్లు, 24 గంటల కరెంటు ఇచ్చి సంబురాలు చేసుకొంటే, కాంగ్రెస్ నాయకులు కేసులు పెట్టి సంబురాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ఇద్దరు, ముగ్గురు తాబేదార్లయిన అధికారులను అడ్డంపెట్టుకుని ప్రతిపక్షాన్ని ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఆయన నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎగ్గొట్టిన రైతు భరోసాపై ప్రజల్లో జరుగుతున్న చర్చను పక్కదారి పట్టించేందుకే చెత్త కేసులను తెరపైకి తెస్తున్నారని దుయ్యబట్టారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న సీఎంకే ఫార్ములా-ఈ కేసు చుట్టుకుంటుందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో నంబర్ వన్ స్థానంలో నిలిపితే, రేవంత్‌రెడ్డి అన్నింటా అధోగతిపాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఫార్మర్స్ కావాలని, కాంగ్రెస్‌కు మాత్రం ఫార్ములా-ఈ కేసు కావాలని చురకలంటించారు. ఏసీబీ విచారణకు కేటీఆర్ లాయర్‌తో వస్తే ఇబ్బందేమిటని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో లాయర్‌తో విచారణకు హాజరైన రాహుల్‌గాంధీకి ఒక న్యాయం? కేటీఆర్‌కు మరో న్యాయమా? అని నిలదీశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌ను నగరవాసులు గుండెల్లో పెట్టి చూసుకుంటారని, ఆయనపై ఉన్న అభిమానాన్ని తప్పుడు కేసులతో చెరిపివేయలేరని పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా న్యాయమే గెలుస్తుందని, కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటికి వస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. హైకోర్టు తీర్పుపై కాంగ్రెస్ నేతల కంటే ముందు బీజేపీ నాయకులు స్పందించడం చూస్తుంటే వారిద్దరు తోడు దొంగలనే విషయం అర్థమవుతున్నదని, మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

గ్రీన్‌కో నుంచి కాంగ్రెస్‌కు 25 కోట్లు: ప్రశాంత్‌రెడ్డి

దేశంలోని అన్ని పార్టీల్లాగే బీఆర్ఎస్ కూడా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు సేకరించిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టంచేశారు. గ్రీన్‌కో నుంచి అదే పద్ధతిలో నిధులు తీసుకున్నామని చెప్పారు. ఇందులో అవినీతికి ఆస్కారమెక్కడిదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఫార్ములా-ఈ ఒప్పందంలో గోల్‌మాల్ జరిగిందంటూ కేటీఆర్‌పై లొట్టపీసు కేసు పెట్టారని ఆరోపించారు. ఈ కేసు ముసుగులో రాక్షసానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 15 నెలల క్రితం ఒప్పందం కుదుర్చుకొని నగదు చెల్లింపులు జరిగితే, ఇప్పుడు కేసు నమోదు చేయడాన్ని చూస్తే కుట్రకోణం అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ప్రధాని మోదీని కాదని ఫార్ములా-ఈ రేస్ తెచ్చి హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌పై బట్టకాల్చి మీదేస్తే సహించబోమని హెచ్చరించారు. సర్కారు కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులను రాజ్యాంగబద్ధంగానే చిత్తు చేస్తామని స్పష్టంచేశారు.

నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతున్న గంగుల కమలాకర్, చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, పాడి కౌశిక్‌రెడ్డి, పోచంపల్లి తదితరులు

కేటీఆర్‌పై కేసులకు ఆరుసార్లు యత్నం

- ఈ రేస్‌లో ఎలాంటి అవినీతి లేదు
- అవినీతి ఉంటే ఎఫ్ఈవోపై కేసు పెట్టాలి కదా?:శ్రీనివాస్‌గౌడ్
- కేసీఆర్ కుటుంబాన్ని బద్నాం చేయాలని కాంగ్రెస్, బీజేపీ చూస్తున్నయి: గంగుల

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై నిలదీస్తున్నందుకు కేటీఆర్‌పై కేసులు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది లోనే ఆరుసార్లు ప్రయత్నించిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కేసులతోనే రాష్ట్రాన్ని నడపాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని మండిపడ్డారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫార్ములా ఈ రేస్ ప్రపంచంలో కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమని, ఈ రేస్ ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని, రాష్ట్రానికి రూ.700 కోట్ల లబ్ధి కలిగిందని గుర్తుచేశారు. ఈ రేస్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, అవినీతి జరిగి ఉంటే నిర్వహణ సంస్థ ఎఫ్ఈవోపై కేసు పెట్టాలి కదా అని ప్రశ్నించారు. కేటీఆర్ జైల్లో పెట్టాలన్నదే రేవంత్‌రెడ్డి లక్ష్యమని విమర్శించారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉన్నదని, న్యాయపరంగా పోరాడి గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ కుట్ర : గంగుల

కాంగ్రెస్, బీజేపీల టార్గెట్ బీఆర్ఎస్సేనని మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను రాష్ట్రంలో లేకుండా చూడాలని ఉమ్మడిగా కుట్రపన్నుతున్నాయని విమర్శించారు. తమ పార్టీ నాయకులను అక్రమ కేసుల్లో ఇరికించి పైశాచిక ఆనందం పొందుతున్నాయని మండిపడ్డారు. 'కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కక్షగట్టారు. ఏడాదిలోనే ఆరు కేసుల్లో ఇరికించాలని ప్రయత్నించారు. ఇందుకోసమేనా ఆయన ముఖ్యమంత్రి అయింది?' అని ప్రశ్నించారు. ఈ రేస్ రద్దుతో తెలంగాణ ప్రజలు నష్టపోయారని విమర్శించారు. కక్ష సాధింపు ధోరణి వీడి ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడంపై దృష్టిపెట్టాలని హితవుపలికారు. 'కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్‌పై కుట్ర చేస్తున్నాయి. కేసీఆర్ కుటుంబాన్ని బద్నాం చేయాలని చూస్తున్నాయి. కక్షసాధింపు రాజకీయాలను తెలంగాణ సమాజం ఒప్పుకోదు. సియోల్ బాంబులు ఓపెన్ అయ్యాయని పొంగులేటి అంటున్నరు. బాంబులు పేల్చడానికి పొంగులేటి మంత్రి అయ్యారా?' అని నిలదీశారు.

కక్ష సాధింపునకే తప్పుడు కేసు

- చట్టాలను కాలరాస్తున్న కాంగ్రెస్
- ఏసీబీ విచారణకెళ్లిన కేటీఆర్‌ను అడ్డుకోవడం దుర్మార్గం
- ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఫైర్

నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్, చిత్రంలో సునీతాలక్ష్మారెడ్డి, మాలోతు కవిత, గొంగిడి సునీత, తుల ఉమ, రజినీ సాయిచంద్ తదితరులు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తేతెలంగాణ): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కేటీఆర్‌పై కక్ష సాధింపుతోనే రేవంత్ సర్కార్ తప్పుడు కేసు బనాయించిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి చట్టాలను కాలరాస్తూ సొంత రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారని దుయ్యబట్టారు. ఫార్ములా ఈ-కార్ రేస్ తెచ్చి హైదరాబాద్‌ను ప్రపంచ చిత్రపటంలో నిలిపిన కేటీఆర్‌ను బద్నాం చేసేందుకే కేసుల పేరిట కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో బీఆర్ఎస్ మహిళా నేతలు సునీతాలక్ష్మారెడ్డి, మాలోతు కవిత, గొంగిడి సునీత, తుల ఉమ, కీర్తిలత తదితరులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రూ.50 లక్షలు ఇచ్చి ఎమ్మెల్సీని కొనుగోలు చేస్తూ దొరికిపోయి జైలుకెళ్లిన రేవంత్‌రెడ్డి, గద్దెనెక్కి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు కూడా సాధ్యపడని విధంగా ఈ-కారు రేస్ తెచ్చి తెలంగాణ ఖ్యాతిని పెంచిన కేటీఆర్‌పై ఏసీబీని ఉసిగొల్పుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. లాయర్‌తో విచారణకు హాజరైన ఆయనను ఏసీబీ బయట నిలబెట్టి పైశాచిక ఆనందం పొందారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో మోదీ, రాష్ట్రంలో రేవంత్ దర్యాపు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

ఇది డైవర్షన్ డ్రామా: సునీతాలక్ష్మారెడ్డి

ఏడాది పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ డ్రామాలు మొదలుపెట్టారని మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. తప్పులు ఎత్తిచూపిన కేటీఆర్‌పై ఈ-కార్ రేస్ కేసు పెట్టడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రైతుభరోసా ఎగ్గొట్టి, పింఛన్లకు ఎగనామంపెట్టి, రుణమాఫీలో కోతపెట్టిన ఆయన ప్రజల దృష్టి మరల్చేందుకే కేసుల నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు.

కడిగిన ముత్యంలా వస్తారు: మాజీ ఎంపీ మాలోతు కవిత

మంత్రిగా హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు శ్రమించిన కేటీఆర్‌ను అణచివేసేందుకే ప్రభుత్వం ఫార్ములా ఈ-కారు రేస్ కేసు ముసుగులో ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని మాజీ ఎంపీ మాలోతు కవిత ఫైర్ అయ్యారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ సర్కారు తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

పాలన చేతగాక ఇబ్బందులు : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

కేటీఆర్‌పై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపేందుకు కుట్ర చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మండిపడ్డారు. పాలన చేతగాక ప్రతిపక్షాలను ఇబ్బందిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఆయన దుర్మార్గాలను బీఆర్ఎస్ చట్టబద్ధంగా ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు.

కేటీఆర్‌పై ముమ్మాటికీ తప్పుడు కేసే: దాసోజు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి సర్కారు పెట్టినది ముమ్మాటికీ తప్పుడు కేసే అని ఆ పార్టీ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసు పెట్టడమేంటని ప్రశ్నించారు. ఆయన జైలుకు వెళ్లాడు కాబట్టి.. కేటీఆర్‌ను కూడా జైలుకు పంపాలనే దురుద్దేశంతోనే రేవంత్‌రెడ్డి ఈ-ఫార్ములా కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతామని, సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపారు.

అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధం: రూప్‌సింగ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినంత మాత్రాన మునిగిపోయింది ఏమీ లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీ సెల్ నేత ఎల్ రూప్‌సింగ్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టుకు వెళ్తామని, న్యాయపరంగా కొట్లాడుతామని తెలిపారు. కేటీఆర్ ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, నిరూపిస్తే దేనికైనా సిద్ధమని స్పష్టంచేశారు.

రాజకీయ కక్షతోనే కేసులు: కిశోర్‌గౌడ్

రాజకీయ కక్షతోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌పై కేసులు పెడుతున్నదని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కే కిశోర్‌గౌడ్ మండిపడ్డారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడంతో వారి ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్‌తో బీజేపీ లాలూచీ!

- కాంగ్రెస్‌ను వదిలేసి బీఆర్ఎస్‌పై విమర్శలు
- కేటీఆర్ కేసుపై బీజేపీ నేతల అత్యుత్సాహం
- కొందరి వ్యవహారశైలిపై బీజేపీలో చర్చ

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): కొందరు బీజేపీ నేతల వ్యవహారశైలి ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నవారు రాజకీయంగా అధికారపక్షమైన కాంగ్రెస్‌తో పోరాడాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా కొందరు నేతలు బీఆర్ఎస్ మీద తరుచూ విమర్శలు చేస్తుండటంపై బీజేపీ సీనియర్ నేతలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమైన ప్రధాని నరేంద్రమోదీ కూడా కాంగ్రెస్‌ను వదిలిపెట్టి బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారని, ఇప్పటికైనా కాంగ్రెస్‌తో కొట్లాడాలని ఆదేశించినట్టు వార్తలు వచ్చాయి. స్వయంగా మోదీ ఆదేశించినా పార్టీలోని కొందరు నేతలు ఏమాత్రం మారకపోవడంపై సీనియర్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు మంగళవారం జరిగిన ఘటనలనే ఉదాహరణగా చూపుతున్నారు. కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన తర్వాత కాంగ్రెస్ నేతల కన్నా ముందే బీజేపీ నేతలు స్పందించారని చెప్తున్నారు. రేవంత్ అనుకూల మీడియాకు ఫోన్-ఇన్‌లు ఇస్తూ కేటీఆర్‌ను అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని అంటున్నారు. వాస్తవానికి, ఫార్ములా-ఈ రేసు కేవలం రాజకీయ కక్షలో భాగంగా పెట్టిందని, ఇది కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధమని, బీజేపీ నేతలు ఎందుకు అత్యుత్సాహంతో మధ్యలో దూరుతున్నారో తెలియడం లేదంటూ సీనియర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి అంశాలపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు స్పందిస్తుంటారని, పార్టీ పాలసీ ప్రకారం మాట్లాడుతారని చెప్తున్నారు. కానీ, బీజేపీ ఎంపీలు రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వంటి నేతలు ఎందుకు కేటీఆర్ పిటిషన్‌పై మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదంటూ అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తే బీజేపీకి చెందిన కొందరు నేతలు కాంగ్రెస్‌తో లాలూచీ పడ్డారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని అంటున్నారు.

హామీలు అమలు చేయలేని దద్దమ్మ రేవంత్

- ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ నేతలపై కేసులు
- ఫార్ములా ఈ రేస్‌తో హైదరాబాద్‌కు ప్రపంచ ఖ్యాతి
- ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి

ఖలీల్‌వాడి, జనవరి 7: "హామీలు అమలు చేయలేని దద్దమ్మ సీఎం ర